క్లుప్తంగా

అన్నప్రసాద పథకానికి రూ.1.25 లక్షల విరాళం



సూపరింటెండెంట్‌కు చెక్కు అందజేస్తున్న దాత సుబ్బారెడ్డి

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బుధవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌కి చెందిన కె.సుబ్బారెడ్డి రూ.1.25 లక్షల విరాళాన్ని అందజేశారు. సింహగిరిపై సంబంధిత చెక్కుని ప్రోటోకాల్ విభాగం సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరపున దాతకు ఆలయ అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

చదువుతోనే ఉన్నతి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సతీష్‌కుమార్

పెందుర్తి: క్రమశిక్షణతో కూడిన చదువు వల్లే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సీఐ కె.వి.సతీష్ కుమార్ అన్నారు. సుజాతనగర్‌లోని భాష్యం స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ అంకితభావంతో నిజాయితీగా పని మీద శ్రద్ధ పెడితే తప్పకుండా విజయం సొంతమవుతుందన్నారు. ఎవరైనా ఆడపిల్లలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆడ పిల్లలకు ఏ సమస్య వచ్చినా శక్తి యాప్‌తోపాటు నేరుగా తమకు సమాచారం అందించవచ్చని సూచించారు. పలు అంశాలపై విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పాఠశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న నారాయణరావు, పాఠశాల సిబ్బంది

పెందుర్తి: మండలంలోని రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు గ్రామవాసి వెన్నెల అప్పలనాయుడు నోట్ పుస్తకాలు, ఇతర స్టేషనరీ సమకూర్చారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 160 మంది విద్యార్థులకు రూ.25 వేలు విలువ చేసే సామగ్రిని అందించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ రెడ్డి నారాయణరావు, వెన్నెల అభిహిత్‌నాయుడు, హెచ్‌ఎంలు రాము, కళావతి, సిబ్బంది పాల్గొన్నారు.


పోషకాహార కిట్ల అందజేత



గర్భిణులు, బాలింతలకు పోషకాహార కిట్లు అందజేస్తున్న చిన్న

పరవాడ: రావాడ శివారు శృంగారపాడు అంగన్వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, బాలామృతం, గుడ్లు, పాలు, చెక్కీలు, బెల్లం కిట్లను టీడీపీ మండల నాయకుడు వియ్యపు చిన్న అందజేశారు. ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంలా పనిచేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎం.వీరునాయుడు, ఎం.అప్పలరత్నం, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలు ప్రారంభం



బాక్సింగ్ పోటీలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: జిల్లా ప్రాధికార సంస్థ అధికారుల ఆధ్వర్యంలో ఈ నెల 29న హాకీ లెజండ్ మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లా స్థాయి బాక్సింగ్, ఆర్చరీ పోటీల ఎంపికలను పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ ఎంపికలకు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జోన్ - 1 శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని డీఎస్‌డీవో ఎల్.వి.రమణ తెలిపారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎంపిక పోటీలను ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్ ప్రారంభించారు.

రాయపురాజు చెరువుకు గర్భశోకం

- మండలంలోని అతిపెద్ద సాగునీటి చెరువులో అధిక శాతం ఆక్రమణలే
- చెరువులో పాగా వేసి దర్జాగా సాగు
- అక్రమంగా మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతుల విజ్ఞప్తి

మండలంలో అతిపెద్దదైన గొల్లలపాలెం రాయపురాజు సాగునీటి చెరువులో అక్రమార్కులు పాగా వేశారు. అధిక శాతం భూమిని ఆక్రమించడంతోపాటు చెరువు గర్భాన్ని ఇష్టానుసారం తవ్వి.. అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతోపాటు కాస్త సహకారం అందిస్తున్నారు. ఏళ్ల తరబడి ఈ చెరువులో ఆక్రమణలకు పాల్పడిన వారికి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంతో పలు దీర్ఘకాలిక పంటలను సైతం సాగుచేసుకుంటున్నారు.

– సబ్బవరం



రాయపురాజు చెరువు గర్భాన్ని తవ్వి అక్రమంగా తరలించుకుపోయిన మట్టి



చెరువు గర్భాన్ని సర్పంచ్ మోపాడ అప్పారావుతో కలిసి పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ తదితరులు(ఫైల్)

గొల్లలపాలెంలోని రాయపురాజు చెరువు సుమారు 178.83 ఎకరాల్లో విస్తరించి ఉంది. గొల్లలపాలెం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 266లో సుమారు 78.83 ఎకరాలు, జీవీఎంసీ పరిధి నంగినారపాడు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌లో సుమారు 100 ఎకరాలు ఉంది. ఈ చెరువుకు గొల్లలపాలెం, పైడివాడ, అమృతపురం, తవ్వవానిపాలెం, అమ్మరపిన్నివానిపాలెం ఆయకట్టు గ్రామాలుగా ఉన్నాయి. ఈ చెరువుకు అధికారికంగా ఆయా గ్రామాల్లో 240 ఎకరాల వరకు ఆయకట్టు ఉండగా.. అనధికారికంగా 500 నుంచి 600 ఎకరాల వరకు ఉంది. సుమారు 400 నుంచి 500 మంది వరకూ ఆయకట్టు రైతులు ఈ చెరువును సాగునీటి వనరుగా తమ భూములను సాగుచేసుకుంటున్నారు.

పెద్ద చెరువు కావడంతో ఆక్రమణలు

రాయపురాజు సాగునీటి చెరువు అతిపెద్దది కావడంతోపాటు జీవీఎంసీ పరిధిలోని వెదుళ్ల నరవ, నంగినారపాడు గ్రామాలను ఆనుకుని దువ్వాడ, గాజువాక ప్రాంతాలకు సమీపంలో ఉంటుంది. ఈ ప్రాంతంలోని భూములు అత్యంత విలువైనవి కావడంతో చెరువు గర్భం ఆక్రమణలకు గురైంది. ఈ చెరువులోని మట్టిని అక్రమ మార్గంలో తరలించేందుకు అనువుగా ఉంటుంది. దీంతో ఇక్కడి మట్టిని తరలించి సొమ్ము చేసుకునే ప్రధాన వనరుగా అక్రమార్కులు వినియోగించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వంలో పెద్దెత్తున లే అవుట్‌ల అభివృద్ధికి, బేస్‌మెంట్‌ల ఫిల్లింగ్, ఇటుకల బట్టీలు వంటి వాటికి మట్టిని తరలించి ఒక్కో రోజులో రూ.లక్షలు కొల్లగొడుతున్నారు.



ఇటీవల మట్టి తరలిస్తుండగా గ్రామస్తులు, ఆయకట్టు రైతులు అడ్డుకున్న పొక్లెయిన్, ట్రాక్టర్లు

అధికారుల సహకారంతో సాగు

ఈ చెరువు 178.83 ఎకరాల విస్తీర్ణం కాగా.. నంగినారపాడు రెవెన్యూ పరిధిలోని సుమారు 40 ఎకరాల వరకు కొంత మంది చెరువులో ఆక్రమణలకు పాల్పడి సాగు చేసుకుంటున్నారు. గతంలో గొల్లలపాలేనికి చెందిన సమారు 100 మంది వరకు రైతులు ఆక్రమణలను తొలగించాలని నెల రోజుల పాటు చెరువు వద్ద నిరసన చేపట్టడంతో జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని వాటిని తొలగించారు.

అనంతరం దీనిపై చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకుండటంతో అక్రమార్కులు మళ్లీ ఆక్రమణలకు పాల్పడుతూ శాశ్వతంగా పాగా వేసి సాగు చేసుకుంటున్నారు. అధికారుల సహకారంతో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని పాకలు, పందిళ్లు వేసుకుని కొబ్బరి, యూకలిప్టస్ వంటి దీర్ఘకాలిక పంటలను దర్జాగా సాగుచేసుకుంటున్నారు.

కూటమి నేతల అండతో..

కొంత మంది కూటమి నేతల అండతో అనుమతుల పేరుతో రాత్రి పూట పెద్దెత్తున పొక్లెయిన్‌లు, డంపర్‌లతో చెరువులోని మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీనిని పసగట్టి గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ విషయం వివాదం కావడంతో అక్కడికి పోలీసులు చేరుకుని గ్రామస్తులకు సర్దిచెప్పి వాహనాలను అదుపులోకి తీసుకున్నారు. గ్రామస్తులు వెళ్లిపోయాక వాహనాలను విడిచిపెట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరుసటి రోజు మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆయకట్టు రైతులతో కలిసి అక్రమంగా తవ్వకాలు చేపడుతున్న చెరువు గర్భాన్ని పరిశీలించారు. అక్రమంగా రాత్రి పూట మట్టి తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినప్పటికీ ఫలితం కనిపించలేదు.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

చెరువు గర్భం ఆక్రమణలు, అక్రమ మట్టి తరలింపుపై అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు, ఆయకట్టు రైతులు వాపోతున్నారు. అనేక పర్యాయాలు సబ్బవరం తహసీల్దార్‌తోపాటు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా.. పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. రాయపురాజు చెరువు ఆక్రమణలు, అక్రమ మట్టి తవ్వకాలపై జిల్లా కలెక్టర్‌కు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్టు ఆయకట్టు రైతులు చెబుతున్నారు. దీనిపై తగు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రాయపురాజు చెరువు వివరాలు
చెరువు గర్భం విస్తీర్ణం 178.83 ఎకరాలు
చెరువు విస్తరించిన రెవెన్యూ గ్రామాలు గొల్లలపాలెం, నంగినారపాడు
ఆయకట్టు విస్తీర్ణం అధికారికంగా 240 ఎకరాలు, అనధికారికంగా 500 నుంచి 600 ఎకరాలు
ఆయకట్టు గ్రామాలు గొల్లలపాలెం, పైడివాడ, తవ్వానిపాలెం, అమృతపురం, అమరపిన్నివానిపాలెం
ఆయకట్టు రైతులు 400 నుంచి 500 మంది
ఆక్రమణలకు గురైన విస్తీర్ణం సుమారు 40 ఎకరాలు

చర్యలు తీసుకుంటాం



రాయపురాజు చెరువు గర్భంలో మట్టి తీసుకుని తమ భూమిని చదును చేసుకునేందుకు మాత్రం 1,500 క్యూబిక్ మీటర్లకు ఒక వ్యక్తికి అనుమతులిచ్చాం. ఈ మట్టిని ఇతర వాణిజ్య అవసరాలకు తరలించకూడదు. మట్టిని తరలించే విషయంలో చెరువుకు నష్టం కలిగించినా, వాణిజ్య అవసరాలకు వినియోగించినా అనుమతులు రద్దు చేసి వారిపై చర్యలు తీసుకుంటాం.

– జి.కార్తీక్, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ, సబ్బవరం

అప్పన్నను దర్శించుకున్న స్వామీజీలు



ఆశీర్వచనం అందుకుంటున్న హరిద్వార్, పూరిలకు చెందిన స్వామీజీలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం హరిద్వార్‌కు చెందిన మహా మండలేశ్వర్ నారాయణానంద్ గిరి మహరాజ్ నిరంజని అకాడ, ఒడిశాలోని పూరికి చెందిన పరమపూజ్య శ్రీ స్వామి ఆత్మనిష్టానంద్ గిరిజి మహారాజ్‌లు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభానికి మొక్కుకున్నారు. బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. వారి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు, వేద స్వస్తి నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామీజీలకు స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

సాలాపు మణి మృతికి సంతాపం



వైఎస్సార్‌సీపీ నాయకుడు సాలాపు బాబూరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న అదీప్‌రాజ్

పరవాడ: సాలాపువానిపాలేనికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు సాలాపు బాబూరావు భార్య సాలాపు మణి బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, పార్టీ పెందుర్తి సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మణి భౌతిక కాయానికి నివాళి అర్పించి సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం బాబూరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు యలమర్తి బుజ్జీ, సుందరపు అప్పారావు తదితరులు ఉన్నారు.

‘పీ4’ పురోగతిపై సమీక్ష



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి రమామణి

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి రమామణి ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పీ4 కార్యక్రమం పురోగతిపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్లతో బుధవారం ఆమె సమీక్ష నిర్వహించారు. మండలంలో గుర్తించిన బంగారు కుటుంబాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. 24 గ్రామ పంచాయతీల్లో ఇప్పటి వరకూ నిర్వహించిన సర్వేలో 3,550 బంగారు కుటుంబాలను గుర్తించగా 1808 కుటుంబాలను అర్హులుగా తేల్చామని ఇన్‌చార్జి ఎంపీడీవో శివప్రసాద్ నారాయణ తెలిపారు. వీరిలో ఇప్పటి వరకూ 1252 కుటుంబాలకు మార్గదర్శులను మ్యాపింగ్ చేశామని తెలిపారు. అనంతరం ప్రత్యేకాధికారి రమామణి మాట్లాడుతూ గ్రామాల్లోని స్థితిమంతులు, విద్యావంతులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి మిగిలిన కుటుంబాలకు మార్గదర్శులను గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల అరెస్టు అన్యాయం



మాట్లాడుతున్న మాణిక్యం

పరవాడ: నక్కపల్లిలో బల్క్ డ్రగ్స్ పార్క్ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని కోరిన సీపీఎం నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, కార్యదర్శి ఎం.అప్పలరాజులను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని సీపీఎం మండల కన్వీనర్ పి.మాణిక్యం అన్నారు. బుధవారం ఆమె దేశపాత్రుని పాలెంలో విలేకరులతో మాట్లాడారు. నక్కపల్లిలో బల్క్ డ్రగ్స్ పార్క్‌పై ప్రజల నిర్ణయం తెలియకుండా రాజకీయ నాయకులు ఏ విధంగా అభిప్రాయ సేకరణ జరుపుతారన్నారు. ఇది దుర్మార్గమన్నారు. హోం మంత్రి అనిత నియోజకవర్గంలో సీపీఎం నాయకులను అరెస్టు చేస్తూ ఉంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సీపీఎం నాయకులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని మాణిక్యం హెచ్చరించారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం



క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం: బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కోర్సుకి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని చెప్పారు. అదేవిధంగా నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు. విభిన్న విశ్వవిద్యాలయాల ఆచార్యులు, పరిశ్రమల నిపుణులు ఆచార్యులకు శిక్షణ అందిస్తారని వీసీ రాజశేఖర్ తెలిపారు.

గురుకులం పరిశీలన



సబ్బవరపు గణేష్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సబ్బవరం : సబ్బవరంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులంను ఎస్సీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో సదుపాయాలు, విద్యార్థుల చదువును ఆయన పరిశీలించారు. విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు పని చేసినప్పుడే లక్ష్యాలు చేరుకోవచ్చన్నారు. పేదరికంలో మగ్గుతున్న తల్లిదండ్రుల ఆశలు నెరవేరడానికి, ఉపాధ్యాయులకు గౌరవం పెరగడానికి ఈ గురుకుల పాఠశాలల పనితీరు ప్రామాణికమని తెలిపారు. అనంతరం సబ్బవరపు గణేష్‌ను ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ, ఉపాధ్యాయులు సత్కరించారు.

మందుబాబులకు జరిమానా

పెందుర్తి: పెందుర్తి ప్రాంతంలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడిన 11 మందికి కోర్టు రూ.1,10,000 జరిమానా విధించినట్లు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరాజు తెలిపారు. బుధవారం వీరందరినీ జిల్లా 2వ ప్రత్యేక జ్యుడీసియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా.. జడ్జి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ చెప్పారు.

గ్రంథాలయానికి వాటర్ డిస్పెన్సర్ వితరణ



వాటర్ డిస్పెన్సర్‌ను గ్రంథాలయానికి అందిస్తున్న శరగడం బుజ్జి

పెందుర్తి : శాఖ గ్రంథాలయానికి స్థానిక నాయకుడు శరగడం బుజ్జి బాటిల్ వాటర్ డిస్పెన్సర్‌ను సమకూర్చారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి బి.చంద్రకళ, అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, పెంటకోట గణేష్, ఆడారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం



ఏఎంసీ సభ్యులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి : పెందుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రభుత్వం నియమించింది. చైర్మన్‌గా నిరుజోగి జ్యోతి, వైస్ చైర్మన్‌గా గొరపల్లి సోమునాయుడు, సభ్యులుగా గల్లా శ్రీనివాసరావు, మరువాడ మోనికేషిని, కుంచర్లపాటి వెంకటరామకృష్ణరాజు, కొత్తపల్లి అపర్ణ, గొర్లె కనకారావు, బొండా కల్యాణరాజు, మజ్జి సన్యాసిపాత్రుడు, రెడ్డి రామునాయుడు, గొంతిన హైమావతి, ఉరిటి గోవిందు, ముమ్మన సతీష్‌కుమార్, రాయవరపు సింహాచలం, కోరుబిల్లి సంతోష్‌కుమార్‌ను నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా గురువులకు వందనం వేడుకలు



విజయ జ్యోతిని సత్కరిస్తున్న అతిథులు

మద్దిలపాలెం : విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువులకు వందనం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ వర్కర్ ఉష పేరిట సీనియర్ కూచిపూడి నాట్యకళాకారిణి బి.విజయ జ్యోతికి ఉష జీవిత సాఫల్య పురస్కారం అతిథుల చేతుల మీదుగా అందించి ఘనంగా సత్కరించారు. ఉత్తరాంధ్రకు చెందిన 22 మంది గురువులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పైడా క్రిష్ణ ప్రసాద్, డాక్టర్ శ్రీధర్ మిత్ర, కూచిపూడి కళాక్షేత్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.శ్రీనివాస్, విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి కన్నం వెంకటరమణారావు, అధ్యక్షులు హరి రామమూర్తి, సింధుజ, గోపీనాథ్, మహాలక్ష్మి, రాగా, కళ్యాణి పాల్గొన్నారు.

45 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టివేత

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాలరిపేటలో 45 బస్తాల పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయి. విశ్వసనీయ సమాచారం మేరకు ఎంవీపీ పోలీసులతోపాటు పౌరసరఫరాల శాఖ ఇన్‌స్పెక్టర్ సర్కిల్ – 2 నమ్మి నరేష్‌బాబు మంగళవారం రాత్రి దాడులు చేశారు. బొలేరో వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తున్న సూరి జగన్నాథరావు(65), అతని కుమారుడు మోహన్ నుంచి 45 బస్తాల (2250 కేజీల) పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.